❖•❖•❖ 8 ❖•❖•❖

# యూదా పొరపాట్లు

*“యేసు ఈ మాటలు పలికిన తరువాత ఆత్మలో కలవరపడి – మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని రూఢిగా చెప్పెను” (యోహాను 13:21).*

యేసును అప్పగించుట ద్వారా యూదా అగుపరచిన నమ్మకద్రోహము మానవ చరిత్ర యందంతటిలోని అతి విచారకరమైన వృత్తాంతములలో ఒకటై యున్నది. ఈ సంఘటనల పరంపర గూర్చి మనము కొన్ని ప్రశ్నలు వేసుకొందాము. ఇది సంభవించుటకు గల హేతువేమై యున్నది? యూదా మొదటి నుండి కూడా ఒక దేశద్రోహియై యుండెనా? యేసు తనకు అతి సన్నిహితులుగా నుండి సహచరుల వలయములోనికి ఒక తస్కరుడైన వానిని మరియు ఒక దొంగని బుద్ధిపూర్వకముగా ఆహ్వానించాడా? యూదా యొక్క విషాదాంతము ఒక మర్మము మరియు ఒక సాధారణ సంఘటనయై యున్నది; ఏలయనగా అది యేసుతో కూడా నివసించుచు ఆయనతో కూడ నడుచుచుండిన ఒకని హృదయములో గర్భముదాల్చి, జన్మమెత్తి, మరియు ఎదిగిన దుష్టత్వము నుండి పుట్టుకొని వచ్చినది.

దేవుని కుమారుడు – సకల మానవుల హృదయములను ఎరిగినవాడు – ఆయన యొక్క అపొస్తలులై యుండుటకు యూదాను మరియు ఇతర పదనొకండుగురిని ఏర్పరచుకొన్నాడు (లూకా 6:13–16). ఒక రాత్రి జామును ప్రార్థనలో గడిపిన తరువాత, ఆయన వీరిని తన శిష్యులలో నుండి ఎన్నుకొన్నాడు, ఎందుకనగా, ఆయన దృష్టిలో వారు ఆయన యొక్క ప్రేషణమును నెరవేర్చుటకు ఆయనకు సహాయము చేయు నిమిత్తము ఆయన సిద్ధపరచనై యుండిన వారిలో ఉండవలెనని ఆయన ఆశించిన లక్షణములు కలిగియుండిరి. ఆయన ఎంపికలో, యేసు యూదా యొక్క గుణగణములోని లోపమును లేదా ఘోరమైన వ్యాధితో బాధపడుచున్న హృదయమును చూచీచూడనట్లు ఉండలేదు. ఆయన వానిలో అంతర్గతముగా దాగియుండిన సామర్థ్యమును మరియు అంకిత భావమును గమనించాడు, మరియు ఆయన యూదాను ఎంచుకొన్నప్పుడు ఆయన ఏమి చేయుచుండెనో ఎరిగియుండెను. దీనికి తోడుగా, యూదా వాని నియామకమును క్రీస్తుకు ఒక రాయబారిగా సంతోషముతోను, ఉత్సాహముతోను, మరియు నిష్కపటమైన నిబద్ధతతోను అంగీకరించాడు. అపొస్తలిక

బృందములోని వారెవరును వాని చిత్తశుద్ధిని సందేహించలేదు లేక వాని సామర్థ్యము గూర్చి ఎదురు ప్రశ్న వేయలేదు. వాడు వారందరి నిధులను సమాళించుటకు సహితము సరిపోయినవాడని వానిని విశ్వసించారు (యోహాను 13:29).

తలాంతులుగలవాడును, ఆకాంక్షింపబడిన అపొస్తలుడుగాను ఉండిన యూదా, కుటిల బుద్ధిగలవాడును, మోసగించే దేశద్రోహిగా - చిత్తశుద్ధి, విశ్వసనీయతగల క్రీస్తు భక్తుడై యుండిన స్థితి నుండి ఉద్దేశపూర్వకముగా ఉపేక్షించిన దుష్టుని పంచకు ఎలా పడిపోయాడు? ఆదిలోనే నిర్ణీతమైన మార్గములో నుండి ఒక స్థాయిలో క్రీస్తు నుండి అవలీలగా క్రిందకి కదిలి జారిపోయాడు కానీ నెమ్మదిగా ఆయన నుండి అంతకంతకు యింకా దూరముగా తప్పిపోవుట వలన వాడు అలా చేశాడని లేఖనములు సలహా నిచ్చుచున్నవి. అంతిమమును, విధ్వంసకమునైన విద్రోహము నిమిత్తము లెక్కలేనన్ని చిన్న చిన్న నిర్ణయాలు వానిని సిద్ధము చేయుచుండినందున వాడు వారి దారితప్పుట గుర్తుపట్టలేనంతటి అతి సూక్ష్మ భేదముతో జరిగినది. ఒక అంధకార ఆవేశము కొరకు వాని హృదయములో చిన్న బీటలేర్పడునట్లు చేసుకొని, అటుతరువాత దుష్ట ఆకాంక్ష స్వల్పకాల సందర్శనము కొరకు వాని హృదయము లోనికి ప్రవేశించునట్లు అనుమతించి, చివరకు ఆ భయంకరమైన ఆకాంక్షకు వాని ఆత్మలో ఒక స్థిరమైన స్థానమును ఏర్పరచాడు.

అలాగైతే, ఇక్కడ, నాశనము వైపు యూదా పయనించిన బాటలో చెదరియున్న దారిగుర్తులు గల స్తంభాలు ఉన్నాయి.

*ధనము నిమిత్తము వాని అంతరంగములో అభివృద్ధియగుచుండిన మితిమీరిన ఆసక్తిని వాడు పరీక్షించి చూచుకొనలేదు.* ధనాపేక్ష వానిలోనికి ప్రవేశించునట్లు అనుమతించాడు; అప్పుడు, నెమ్మదిగానే ఆయనను ఖచ్చితముగా, అది వాని ఆంతర్యములో చేయాల్సిన ప్రాణాంతకమైన పని చేసినది. ధనమును అపేక్షించువారెవరైనను - వాడు క్రీస్తు అపొస్తలుడైనను - భయంకరమైన అపాయములో ఉన్నాడని వాడు గ్రహించినట్లు కనబడటలేదు. యేసు తన పరిచర్యను ప్రారంభించిన మొదటి నుండే, యూదా అపొస్తలులందరికి కోశాధికారిగా పని చేశాడు. వాని ప్రక్కలోనే ఉండిన డబ్బు సంచిలోని నాణ్యములు గలగలమను శబ్దము చేసియుండును. అటుతరువాత యేసు పరిచర్యలో, మరియ మిక్కిలి విలువగల జటామాంసి అత్తరును యేసు పాదములపై పోసి పూసినప్పుడు, యూదా, "ఇదెంత నష్టము కదా! మనము దీనిని అమ్మి ఇదే డబ్బును బీదలకు ఇవ్వవచ్చును కదా!" అన్నట్టుగా మాట్లాడాడు (యోహాను 12:5). "వాడీలాగు చెప్పినది బీదలమీద శ్రద్ధకలిగి కాదు గాని వాడు దొంగయైయుండి, తన దగ్గర డబ్బుసంచి యుండినందున అందులో వేయబడినది దొంగిలించుచు వచ్చెను గనుక ఆలాగు చెప్పెను" అని యోహాను యూదాను గూర్చి రచించాడు (యోహాను 12:6). రోజులు దొర్లిపోయిన కొలది, భౌతిక కలిమిలేముల గూర్చి వానికి కలిగిన ఆశ చివరకు అది వానినే దాని అదుపులో ఉంచుకొనునంతగా అధికమయ్యింది. యూదా నియంత్రణలో డబ్బు సంచి ఉన్నంత కాలము, అంతా సవ్యంగానే సాగినది; కానీ డబ్బు ఆధిపత్యములోనికి యూదా అడుగిడగానే, సర్వనాశనము వాని వెంటబడినది. పేరాస వాని హృదయములోని ఒక చిన్న మూలలో నుండి మొలకెత్తి వాని ఆత్మను నింపివేసిన ఒక పర్వతమంత ఎత్తునకు ఎదిగినది.

*యూదా సత్యమును ఎలా పూర్తిగా వినాలో ఎన్నడూ నేర్చుకొనలేదు.* క్రీస్తు మాటలాడుచు నేర్పించిన విషయాలను వినుటకు వానికి ప్రత్యేకావకాశం ఉండినది, కానీ

ప్రభువు మాటలు వాని హృదయమును హస్తగతము చేసుకొనునట్లు వాడు అనుమతించలేదు. వాడు ఆ మాటలు విన్నాడు, అట్లయినను వాడు వాటిని ఆలకించలేదు. "మాటలు ఇవతలి చెవిలో నుండి లోపలికి వెళ్ళి అవతలి చెవిలో నుండి వెలుపలికి వెళ్ళిపోయాయి" అని మనము చెప్పుకొనుచుందుము. "ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట దుర్లభమని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని యేసు ప్రకటించుట యూదా విన్నాడు (మత్తయి 19:23). "మీరు ఏ విధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి; ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదు" అని ఆయన హెచ్చరించుట విన్నాడు (లూకా 12:15). "ఒక మనుష్యుడు లోకమంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొంటె అతనికేమి ప్రయోజనము?" అని ఆయన చెప్పినప్పుడు ఆలకించాడు (మత్తయి 16:26ఎ). యూదా ఈ ప్రకటనలు విన్నప్పుడు, "ఆమేన్" అని చెప్పు అవకాశము కలదు; కానీ వాని హృదయమును కాఠిన్యము చేసుకొనుచుండిన భౌతిక విషయములకు ప్రాధాన్యతనిచ్చిన రోగమును కూకటివేళ్లతో పెల్లగించుటకు అవి వానిని నిర్బంధించకుండునట్లు వాడు అనుమతించలేదు. "యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను. సత్యవిషయమైన అనుభవ జ్ఞానము ఎప్పుడును పొందలేని ..." వారి గూర్చి పౌలు చెప్పాడు (2 తిమోతి 3:7).

*క్రీస్తు హెచ్చరికలను యూదా శ్రద్ధగా లక్ష్యపెట్టలేదు.* యోహాను 6:70 ఉదాహరణముగా తెలియజెప్పుచున్నట్లు (64, 71 వచనాలు కూడా చూడుము). యేసు పరిచర్యయందంతటను, యూదా కొంత కాలమునకొకసారి హెచ్చరింపబడ్డాడు అని స్పష్టమగుచున్నది. చివరకు. వాని పాపము పరిపక్వమైనదై వానిని నియంత్రించు గడియ వచ్చినప్పుడు, దాని గూర్చి యేసు వానిని ప్రతిఘటించాడు. యూదా యేసుతో కూడ అంత సన్నిహితముగా ఉండినప్పటికిని, వాని హృదయ కాఠిన్యమును బట్టి వాడు యేసును లక్ష్యపెట్టలేదు. వాడు క్రీస్తుతో కలిగియుండిన సన్నిహిత సంబంధము కంటె ఎక్కువగా వాని అశుభకరమైన అత్యాశను మనస్సులోనే ఉంచుకొన్నాడు. వాడు యూదుల మహా సభవారి యొద్దకు మంగళవారం సాయంకాలమే వెళ్ళి (మత్తయి 26:14-16 చూడుము) వారి కొరకు యేసును గుర్తుపట్టుట గూర్చి ఒక ఒప్పందమును కుదుర్చుకొనియుంటాడు. వాడు నిశ్చయించుకొని, తన నిర్ణయానికి కట్టుబడి పోయాడు.

చివరి రాత్రి భోజన సమయములో, అపొస్తలులలో ఒకడు ఆయనను అప్పగించునని యేసు దృఢపర్చాడు (యోహాను 13:21). అప్పుడు వారిలో ప్రతి ఒక్కడు, "ప్రభువా, అది నేనా?" అని ప్రశ్నించాడు. ఒక వేళ అతడేనేమో అని అడుగుచూ, యూదా యేసు వైపు చూచినప్పుడు, యేసు, "నీవన్నట్టే" అని జవాబిచ్చాడు (మత్తయి 26:25). ఒకరితో నొకరు ఈ మాటలు చెప్పుకొనిన తరువాత, సాతాను యూదాలో ప్రవేశించెను (యోహాను 13:27ఎ); అనగా, వాడు చేయవలెనని ప్రణాళిక వేసుకొన్న పనిని చేయునట్లు సాతాను ఆ శోధనను యూదా హృదయములో తీవ్రతరము చేసి, వాడు భయపడి తన ప్రణాళికను అమలు చేయ మానుకొనకుండునట్లు వానిని నియంత్రించాడు. యేసు, "నీవు చేయుచున్నది త్వరగా చేయుము" అని యూదాతో చెప్పాడు (యోహాను 13:27బి). ఈ సమయములో, యూదా తన మనస్సులో నిశ్చయించుకొన్నాడనియు విద్రోహ చర్య త్వరలోనే జరుగుననియు యేసు ఎరిగియుండెను. అధికారులకు వాడు యేసును అప్పగించుట గూర్చిన తన ప్రణాళికలకు తుది మెరుగులు దిద్దుటకు యూదా అంధకారమయమై యుండిన రాత్రిలోనికి వెళ్ళిపోయాడు.

కొన్ని గడియల తరువాత, యూదా – యేసును పట్టుకొనుటకు వచ్చుచుండిన వారికి నాయకుడై – తోట ద్వారము దగ్గర ఉండిన యేసును సమీపించాడు. యేసు ఈ జనసమూహమును కలుసుకొన్నాడు, ఆయనే యేసు అని తనను తాను గుర్తించుకొన్నాడు, అక్షరాలా తనను తాను వారి చేతులకు అప్పగించుకొన్నాడు (యోహాను 18:4–8). యూదా ఆయనను గుర్తుపట్టాల్సిన అవసరము లేకుండజేశాడు, కానీ చేస్తానని చేసుకొన్న ఒప్పందము ప్రకారము చేయుటకే యూదా ఎన్నుకొని ముందుకొచ్చాడు. యూదా యేసును ముద్దుపెట్టుకొనక ముందు మరియు ఆ తరువాత కూడా యేసు వానిని గద్దించియుంటె బాగుండేది. "... యేసును ముద్దుపెట్టుకొనుటకు ఆయనయొద్దకు రాగా యేసు – యూదా, నీవు ముద్దుపెట్టుకొని మనుష్యకుమారుని అప్పగించుచున్నావా?" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 22:47బి, 48). మత్తయి వ్రాయుచున్న దాని ప్రకారము, యూదా యేసును ముద్దుపెట్టుకొనిన తరువాత ఆయన, "చెలికాడా, నీవు చేయవచ్చినది చేయుము" అని యూదాతో చెప్పినట్లు వ్రాయబడి యున్నది (మత్తయి 26:50ఎ). అనగా, యూదా యేసు చేసిన గద్దింపులను, మందలింపులను, మరియు కృపతో కూడియుండిన ముఖకవళికలను ప్రక్కకు నెట్టివేసి, విద్రోహ ప్రణాళికలోని ప్రతీ విషయాన్ని అమలు చేయుటకు ముందుకు వెళ్లాడని మరొక మాటలో చెప్పుకొనవచ్చును. వాడు ఆ భయంకరమైన కార్యమును చేయకుండునట్లు వానిని విరోధించుటకు యేసు చేయగలిగిన దానంతటి గుండా వాడు ఎంతో ప్రయాసతో గట్టెక్కాడు.

*వానికియ్యబడిన ప్రశస్తమైన సదవకాశమును యూదా అనుకూలపర్చుకొనలేదు.* యేసుతో, దేవుని కుమారునితో, దైనందిన సాంగత్యములు కలిగియుండుట అది ఎంత గొప్ప అనుభూతియై యుండేదో కదా? ఒకరు ఇటువంటి సహవాసములో జీవించి క్రీస్తును పోలి ఎదుగకుండా ఎలా ఉండగలరు? ఒకరు ఇటువంటి సంబంధము కలిగియుండియు యేసు జీవితము యొక్క శక్తివంతమైన ప్రభావమును నిరోధించి, దుష్టుడు వాని అదుపులో ఉంచుకొనునట్లు వానిని అనుమతించగలరని చేసుకొనుట కష్టముగా నున్నది. అట్లయినప్పటికిని, ఈ మహత్తరమైన ప్రత్యేకావకాశమును ప్రక్కకు పారవేయుటకు సమాళించిన వాడుగా యూదా చరిత్ర పుటల్లోనికెక్కాడు. ఈ పన్నెండు మంది శిష్యులను మించి, మానవ జాతికి చెందినవారిలో ఎవరునూ యేసుతో కూడా ఇటువంటి జీవితము గడుపలేదు. యూదా యొక్క పరిస్థితికి సామానమైనది సమాన్యముగా ఏదియు లేదు. ఒక అపొస్తలుడుగా జీవించగలిగిన అమూల్యమైన జీవితమునకు యూదా నష్టము కలుగజేసుకొన్నాడు. పేతురు, "అతడు మనలో ఒకడుగా ఎంచబడినవాడై యీ పరిచర్యలో పాలుపొందెను ... తన చోటికి పోవుటకు యూదా తప్పిపోయి పోగొట్టుకొనిన యీ పరిచర్య ..." అని యూదాను గూర్చి చెప్పాడు (అపొస్తలుల కార్యములు 1:17–25).

*యూదా సంభవించుచుండిన సంగతుల పరిమాణములను అవగాహన చేసుకొనలేదు.* చరిత్రలోని అతి గొప్ప సంఘటన జరుగుచుండినదని వాడు గుర్తించలేదు. "పెద్దలచేతను ప్రధాన యాజకులచేతను శాస్త్రులచేతను అనేక హింసలు పొంది, చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యము" అని యేసు తన అపొస్తలులతో చెప్పియుండెను (మత్తయి 16:21బి). చివరి రాత్రి భోజన సమయములో, యేసు అపొస్తలులకు ఒక గిన్నె యిచ్చి, "దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల

కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పాడు (మత్తయి 26:27బి, 28). బహుశ యూదా, యేసు ఏమి చేయుచుండెనో గ్రహించియుండకపోవచ్చును లేక యేసు నిజముగానే పట్టబడునని నమ్మియుండకపోవచ్చును లేక యూదుల మహా సభవారితో బేరము కుదుర్చుకొన్నప్పుడు ఒప్పింపబడి యుండవచ్చును (మత్తయి 26:14-16). సంభవించుచుండిన ఈ సంఘటనలన్నిటిలోను, యూదా కేవలము వెండి నాణెములనే చూశాడు, లోక రక్షణార్థమై యేసు యొక్క ఎర్రని రక్తము ప్రవహించుట చూడలేదు. నిత్య జీవమునకు బదులుగా, వాడు ఇహలోక లాభము గూర్చి ఆలోచించుచుండెను.

*యూదా మారుమనస్సును వెదకలేదు.* యేసు సిలువవేయబడబోవుచున్నాడని యూదాకు ఎరుకైనప్పుడు, వాడు ఆ డబ్బును తిరిగి ప్రధాన యాజకుల యొద్దకు తెచ్చి వారికిచ్చివేశాడు (మత్తయి 27:1-10). అయితే వారు తిరిగి తీసుకొనుటకు నిరాకరించారు; కానీ వాడు ఆ డబ్బును దేవాలయములో పారవేసి, "నేను నిరపరాధరక్తమును అప్పగించి పాపము చేసితిని" అని కేకవేశాడు (4ఎ వచనం). యూదా హృదయము తీవ్రమైన పశ్చాత్తాపముచేత బ్రద్దలయ్యింది, కానీ వాడు యథార్థమైన మారుమనస్సును వెదకలేదు. వాడు దాని గూర్చి ఆలోచించియుండినట్లయితే, వాడు మారుమనస్సు సంబంధించి యేసు చేసిన బోధలను జ్ఞాపకమునకు తెచ్చుకొనెడివాడే. తప్పిపోయిన కుమారుని గూర్చి (లూకా 15:11-32), ఒక సహోదరుని డెబ్బది ఏళ్ల మారులమట్టుకు క్షమించుట గూర్చి (మత్తయి 18:21, 22), వ్యభిచారములో పట్టబడిన స్త్రీ గూర్చి (యోహాను 8:1-11) మన ప్రభువు చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని సింహావలోకనము చేసుకొనవలసి యుండెను. యేసు ఆయన చేసిన బోధలకు పరిపూర్ణమైన మాదిరియైయున్నాడని వానికి తెలియును; కానీ ఏదో ఒక కారణం చేత, యూదా దేవుని యెదుట మారుమనస్సు వెదకలేదు.

*యూదా తన దుఃఖము యొక్క ఒత్తడికి తట్టుకొనలేక నేలకూలాడు.* వేధించు దుఃఖము భరించలేని ఒక భారమైన బరువని మనమందరము గుర్తించుదుము. కానీ అది మనపై ఆధిపత్యము చెలాయించుటకు అనుమతించరాదని కూడా మనము అర్థము చేసుకొనవలెను. పేతురు మారుమనస్సు పొందాడు (మత్తయి 26:75), కానీ యూదా విచారపడ్డాడంతే (మత్తయి 27:5). పేతురు దుఃఖము దైవచిత్తానుసారమైనది, కానీ యూదా దుఃఖమ లోకసంబంధమైనదై యుండెను (2 కొరింథీయులకు 7:10). పేతురు దుఃఖము అతని పాదములను యేసు వైపునకు మళ్ళించినది, కానీ యూదా దుఃఖము వాని మెడకు ఒక త్రాడును వ్రేలాడదీసినది. పేతురు దుఃఖము యొక్క ఫలితము - మారుమనస్సు, అయితే యూదా దుఃఖము యొక్క ఫలితము - మరణము.

యూదా యేసు యొద్దకు వచ్చి వాని దోషమును ఆయన యెదుట ఒప్పుకొనియుండినట్లయితే, నిశ్చయముగా వానికి క్షమాపణ దొరికియుండేదే. అంతమాత్రమేగాక, వాని కథ బైబిలులో మారుమనస్సు గూర్చిన అతి గొప్ప కథయై యుండేది. వాడు యథార్థముగా మారుమనస్సు పొందియుండినట్లయితే, తప్పిపోయిన కుమారుడు తన తండ్రి యొద్దకు తిరిగి వచ్చిన కథను చెప్పుకొనుచున్నట్లే, యూదా ప్రభువు నొద్దకు తిరిగి వచ్చిన కథను ఈ రోజుల్లో మనము చెప్పుకొనుచుండెడివారమే.

తన దుఃఖమునకు లొంగిపోయి, "నేను నా నికృష్టమైన జీవితమును అంతము చేసుకొనవలసినదే" అని, యూదా తనకు తానే చెప్పుకొన్నాడు. యేసు ఎదుర్కొనుచుండిన

తీర్పులు ముందుకు సాగుచుండగా, యూదా తన బాటను ఒక చెట్టు, బహుశ దాని కొమ్మ ఎత్తైన కొండ చివర వరకు ఉండియుండవచ్చును, దానివైపునకు మళ్ళించాడు. కంపించుచుండిన కాళ్ళుచేతులతో, వాడు ఒక త్రాడును కొమ్మ మీదికి గిరాటు వేసి, ఆ త్రాడు యొక్క మిగిలిన భాగమును చెట్టు కాండమునకు కట్టివేసాడు. వ్రేలాడుచుండిన త్రాడు చివరన జారుముడి వేసి దాని ఉచ్చును తన మెడకు తగిలించుకొన్నాడు. యేసుకు తీర్పు తీర్చుబడుచుండిన చోటు వైపు చివరి సారిగా వెనుకకు తిరిగి ఆ తరువాత క్రింద నున్న నేలను చూచి యుండవచ్చునని మనము ఊహించుకొనవచ్చును. ఇక కళ్ళు మూసుకొని పెద్ద శ్వాస తీసుకొని, కొండ అంచు నుండి క్రిందికి దూకాడు. త్రాడు బిగుసుకపోయినది, యూదా తన స్వంత స్థలానికి వెళ్ళిపోయాడు – అది వాని నిర్ణయాలే అక్కడికి తీసుకొని వచ్చిన స్థలము.

❖•❖•❖

*యూదా ఇస్కరియోతు నాటకములో ఏదైన ఒక పాత్రను పోషించుటకు ఒక నటుడు ఎన్నుకొనబడినట్లుగా ఒక విద్రోహియై యుండుటకు ఏర్పరచుకొనబడలేదు. విద్రోహియై యుండుటకు యూదానే ఎన్నుకొన్నాడు. యేసు చేత ఉల్లేఖింపబడి చెప్పబడిన లేఖనములను యూదా నెరవేర్చాడనునది నిజమే, కానీ యూదా ఒక అపొస్తలుడై యుండుటకు యేసు వానిని ఏర్పరచుకొన్నప్పుడు వాడు ఈ లేఖనములను నెరవేర్చాలనునది ఆయన యొక్క ప్రేరేపణయై యుండలేదు. ఇంతేగాక, యూదా ద్రోహపూరితమైన సంకల్పమును అదివరకే తన హృదయములో ఉంచుకొనినవాడై యేసును వెంబడించుచుండిన అనుచరుడు కాలేదు. యూదా యొక్క దుష్ట చర్యలు – మానవ దుష్టత్వమంతటివలెనే – తప్పుడు ఎంపికల ఫలితమై యుండినది; అవి జగత్తు పునాది వేయబడకమునుపే నిర్ణయింపబడలేదు. క్రీస్తు సిలువ శ్రమానుభవ సంఘటనలను దేవుడు తన దైవిక చిత్తము నెరవేరు నిమిత్తము తన భవిష్యత్ జ్ఞానము మరియు కటాక్షము చేత నిర్మించాడు, అట్లయినను యూదా శోధనకు లొంగుట వలననే విద్రోహ చర్య జరిగినది.*